పాపం ఉపాధికూలీలు!

ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం కనీసం తాగేందుకు గ్లాసు మంచినీళ్లు ఏర్పాటు చేయలేకపోతోంది. రెక్కలు ముక్కలయ్యేలా శ్రమించిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందించలేకపోతోంది. పనులు చేస్తూ గాయపడినా, ఏదైనా విషపురుగా కాటేసినా ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రథమి చికిత్స ఏర్పాట్లు కూడా చేయలేకపోతోంది. ఎండలకు ఎండుతూ, వానలకు నానుతూ పనులు చేస్తున్న ఉపాధి కూలీల కష్టాలను చూస్తే అయ్యో పాపం అనకుండా ఉండలేం. కానీ ఈ ప్రభుత్వానికే మనసేలేనట్లు వ్యవహరిస్తోంది.

- పని ప్రదేశం వద్ద మౌలిక వసతులు కల్పించని కూటమి ప్రభుత్వం
- దెబ్బలు తగిలినా, విషపురుగులు కుట్టినా కనిపించని ప్రథమచికిత్స బాక్సులు
- ఎండొచ్చినా, వానొచ్చినా తలదాచుకునేందుకు కనిపించని టార్పాలిన్ పట్టలు
- ఎనిమిది వారాలుగా కూలీలకు అందని వేతనాలు


తాటిపాడులో ఉపాధిపనులు చేస్తున్న ఉపాధికూలీలు

జూపాడుబంగ్లా: ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండలాల పరిధిలో రోజుకు 40,389 మంది ఉపాధికూలీలకు పనులు కల్పించాల్సి ఉండగా కేవలం 23,905 మందికి మాత్రమే అధికారులు పనులు కల్పిస్తున్నారు. ఉపాధిపనుల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవటంతో మండుటెండల్లోనే కూలీలు పనులు చేస్తున్నారు. టెంట్లు, మంచినీటి సౌకర్యం, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ తదితర ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి తీసుకెళ్లిన లీటరు వాటర్ బాటిల్‌తోనే ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నెట్టుకొస్తున్నారు. ఈక్రమంలో కొంత మంది కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు.

అందని పనిముట్లు

కొంతకాలంగా పనిముట్లు(గడ్డపార, చలికె, కొడవలి)ఇవ్వకపోవటంతో సొంతంగా డబ్బు వెచ్చించి ఉపాధికూలీలు పనిముట్లు కొనుగోలు చేస్తున్నారు. సొంతంగా పనిముట్లు ఉన్న వారికి పనిముట్లకు కొంత డబ్బును కూలీడబ్బులతో పాటు జమచేయాల్సి ఉంటుంది. అలాచేయటం లేదు. అలాగే సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వటం లేదు. మండే ఎండల్లో రెక్కలు ముక్కలు చేసుకొని చేతులు బొబ్బలొచ్చేలా కష్టించినా అన్ని కలిపి కేవలం రూ.250ల కూలీమాత్రమే ఇస్తుండటంతో ఉపాధికూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిది వారాలుగా అందని వేతనాలు

ఉపాధి పనులు చేసిన వారికి వారం రోజులకోసారి వ్యక్తి బ్యాంకు ఖాతాల్లో వేతనం డబ్బు జమచేయాలనే నిబంధనలున్నాయి. అయితే ఉపాధి కూలీలు గత ఎనిమిది వారాల(48రోజులు) నుంచి పనులు చేస్తున్నా ఇప్పటి దాకా పైసా కూడా జమ చేయలేదు. వారాల తరబడి కూలీడబ్బులు ఇవ్వకపోతే తాము ఎలా బతకాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు.

ఆత్మకూరు క్లస్టరులో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీల వివరాలు

మండలం	గ్రామాల సంఖ్య	రోజువారి డిమాండ్	రోజువారి టార్గెట్	పనికివచ్చే కూలీలసంఖ్య
నందికొట్కూరు	12	4,053	3,200	2,265
జూపాడుబంగ్లా	12	5,036	3,200	3,262
కొత్తపల్లి	12	4,901	3,500	3,509
పగిడ్యాల	08	4,746	2,400	2,507
పాములపాడు	14	9,725	4,400	6,146
ఆత్మకూరు	17	5,031	3,700	2,215
వెలుగోడు	08	6,459	4,600	4,001
మొత్తం	83	39,951	25,000	23,905

కూలీ డబ్బులు పడలేదు



8 వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాను. 15 రోజులకోసారి కూలీడబ్బులు వేస్తామన్నారు. 8వారాల నుంచి పైసా బిల్లు వేయలేదు. త్వరగా కూలీడబ్బులు మా బ్యాంకు ఖాతాల్లో వేస్తే బాగుంటుంది.

– మహేష్‌గౌడు, ఉపాధికూలీ

ఎండలోనే పనులు చేస్తున్నాం



పనుల వద్ద నీడలేకపోవటంతో ఎండలోనే పనులు చేస్తున్నాం. టార్పాలిన్ పట్టలివ్వకపోవటంతో ఎండలోనే పనులు చేస్తున్నాం. ఎండతీవ్రతకు తీవ్రతకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. టార్పాలిన్ పట్టలు ఇస్తే పనుల వద్ద ఎండ నుంచి ఉపశమనం కలుగుతుంది.

– నారాయణ, ఉపాధికూలీ

ప్రథమచికిత్స బాక్సుల్లేవు



పనుల వద్ద ప్రథమచికిత్స బాక్సుల్లేవు. దీంతో పనుల వద్ద గాయాలైనా, విషపు పురుగులు కాటువేసినా కనీసం ప్రథమచికిత్స చేయించుకునే అవకాశం లేదు. చిన్నపాటి గాయం తగిలినా పనుల వద్ద నుంచి డాక్టర్ వద్దకు పరుగులు తీయాల్సి వస్తుంది. ప్రథమ చికిత్స బాక్సులు మంజూరు చేయాలి.

– కృష్ణుడు, ఉపాధికూలీ

క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


ఊయలసేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


హరికథగానం వినిపిస్తున్న కళాకారుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఉపేంద్ర భాగవతార్ బసవపురాణంపై హరికథగానం వినిపించారు. తబల యం.మధు, హార్మోనియం సహకారాన్ని సింహాచలం అందించారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని భ్రమరాంబా చెంచు గూడేనికి చెందిన ఐలేని పుల్లమ్మ(48) గురువారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న చెంచు సమాఖ్య మహిళా మండలి సీసీ యూసుఫ్ శుక్రవారం గూడెంలోని ఆమె కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ.5000 ఆర్థిక సాయం అందించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి


ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

పాములపాడు: ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ణినియ, పీఆర్ డీఈ ధనిబాబు, తహసీల్దార్ సుభద్రమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ, ఎంఈఓ బాలాజీనాయక్, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై డ్రోన్ కెమెరాతో నిఘా

బండిఆత్మకూరు: శాంతిభద్రతలపై డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచనున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన బండిఆత్మకూరు సమీపంలోని బహిరంగ ప్రదేశంలో మందు తాగుతున్న నలుగురిని డ్రోన్ కెమెరాతో గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు మండల పరిధిలోని నారాయణాపురం గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసులు(56) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న చెట్టుకు ఉరివేసుకున్నాడు. అటువైపు వెళ్తున్న వారు గమనించి వెంటనే ఉరి నుంచి తప్పించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మృతుడికి భార్య కిట్టమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈశ్వర, చౌడేశ్వరి, సవారమ్మ ఆలయాల్లో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ప్రాతఃకాల పూజలు, దీక్షాయంత్రహోమం, మూర్తిహోమం, గర్తన్యాసం, నవరత్నన్యాసం, యంత్రప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠాపన, కళ్యాణ్యాల, కూష్మాండబలి, జయాదిహోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహామంగళహారతినిచ్చి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు నూతన ఆలయాల్లో కొలువుదీరిన శివలింగానికి, భ్రమరాంబిక మాత, చౌడేశ్వరి, సవారమ్మ, నాగులస్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో నూతనవస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జయజయ ధ్వానాల మధ్య శివాలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలను తిలకించటానికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, బంధుమిత్రులు తరలివచ్చారు.


శివాలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్టిస్తున్న భక్తులు


కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

పెద్దగుమ్మడాపురం గ్రామంలో ..

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. తదనంతరం భక్తులకు, గ్రామస్తులకు స్వామి వార్ల ఆశీర్వాదాలతో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బ్రిడ్జిని ఢీకొన్న కారు

జూపాడుబంగ్లా: మండ్లెం గ్రామం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్340సీ బ్రిడ్జి వద్ద శుక్రవారం కారు ప్రమాదానికి గురైంది. మండ్లెం గ్రామం నుంచి హైవే రోడ్డు ఎక్కేందుకు ఓ వ్యక్తి కారులో వేగంగా వచ్చాడు. కుడివైపు వంతెన నిర్మాణంలో ఉండటంతో ఎడమ వైపు వంతనపైనే వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. కుడివైపు నుంచి వచ్చిన కారు ఎడమవైపు వంతెనపైకి వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపక్కన ఏర్పాటుచేసిన సిమెంటు దిమ్మెను ఢీకొంది. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా కారులోని వ్యక్తికి స్వల్పగాయాలు కావటంతో నందికొట్కూరు ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ విషయమై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న దాతలు, నిర్వాహకులు

పాములపాడు: గ్రామాల్లో నిర్వహించే క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతుందని బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సమ్మర్ స్పెషల్ ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను ఆయన స్కూల్ కరెస్పాండెంట్ గోపాల్, డాక్టర్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపును ఆస్వాదించాలని, తోటి క్రీడాకారులను గౌరవించాలని సూచించారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 40 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించం

నందికొట్కూరు: ప్రజాపంపిణీ వ్యవస్థను అధికారులు నిర్వీర్యం చేస్తే సహించే ప్రసక్తే లేదని సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్లు మహేష్ నాయుడు, కొంకతి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సివిల్ సప్లయ్ గోడౌన్, కేంద్ర గిడ్డంగి గోడౌన్‌లలో వారు తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలర్లకు బియ్యం తక్కువ రావడంతో ప్రజా పంపిణీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. గోడౌన్ అధికారులు తప్పులు చేయడంతో రేషన్ కార్డుదారులకు సక్రమంగా బియ్యం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొనుగోలు చేస్తారా.. సత్రానికి దానం చేయాలా?

- నందికొట్కూరు కేంద్ర గిడ్డంగిలో అక్రమాలు
- అధికారుల తీరుపై జొన్న రైతు మండిపాటు


విలేకరులతో మాట్లాడుతన్న బాలసుబ్బారెడ్డి

నందికొట్కూరు: కష్ట పడి పండించిన జొన్నలు అమ్ముకుందామని రైతులు కొనుగోలు కేంద్రానికి తరలిస్తే అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు వాపోతున్నారు. పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన రైతు బాల సుబ్బారెడ్డి కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. 150 క్వింటాళ్ల జొన్నలు విక్రయించేందుకు ట్రాక్టర్‌లో మూడు రోజుల క్రితం తీసుకొచ్చానని, రెండు రోజులు అదిగో.. ఇదిగో అంటూ జాప్యం చేసిన అధికారులు మూడో రోజు నాణ్యత లేదని కొనుగోలు చేయక పోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించాడు. దళారులకు మేలు జరిగేలా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతుల వద్ద దళారులు క్వింటా రూ.2 వేల చొప్పున కొనుగోలు చేసి వాటిని కేంద్ర గిడ్డంగి తరలిస్తే అధికారులు రూ. 3 వేల చొప్పున మూడు లారీలు కొనుగోలు చేయడం అక్రమాలకు నిదర్శనమన్నారు. తాను తెచ్చిన జొన్నలు అధికారులు కొనుగోలు చేయకపోతే శ్రీశైలం రెడ్ల సత్రానికి దానం చేస్తానని, ఆ గిడ్డంగిలో అంతా మోసమే జరుగుతుందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతు బాలసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.

నేడు మాజీ ఎమ్మెల్యే శిల్పా రాక

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం వెలుగోడుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనుండటంతో పార్టీ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

శ్రీశైలంలో నేడు యోగాంధ్ర కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనుందని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం ప్రధానాలయానికి ఎదురుగా 1,000 మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరవుతారన్నారు.

ఆలయ భూములకు తగ్గిన ఆదాయం

బండిఆత్మకూరు: మండల కేంద్రమైన బండిఆత్మకూరులో లక్ష్మీజనార్దన, ఆంజనేయస్వామి దేవస్థానం భూములకు పర్యవేక్షణ అధికారి గోపి ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు. పలువురు రైతులు పాల్గొని రూ.3.61 లక్షలకు 17.30 ఎకరాల భూములను దక్కించుకున్నారు. అయితే ఇదే భూములకు గత ఏడాది రూ.4.78 లక్షలు రాగా ఈ ఏడాది రూ.3.61 లక్షలు రావడంతో ఈ ఏడాది ఆలయ భూముల్లో రూ.1.17 లక్షలు ఆదాయం తగ్గింది.

'డయల్ యువర్ డీఎం'ను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాలకు చెందిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సందర్భంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని సెల్ నంబర్ 9959225801 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పండ్ల తోటలు సాగుకు రాయితీలు

జూపాడుబంగ్లా: పండ్లు, పూలతోటలు సాగుచేసుకునే రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నట్లు నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజస్విని తెలిపారు. శుక్రవారం ఆమె తంగడంచ పొలాల్లో సాగైన డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, చీని, డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, జామ, తదితర పండ్లతోటలు, మల్లె, గులాబీ తదితర పూలతోటలు సాగుచేసుకునే రైతులకు రాయితీలు ఇవ్వనున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈమె వెంట తంగడంచ వీహెచ్ఏ వెంకటేష్ ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడండి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలరాజు

జూపాడుబంగ్లా: రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, బాలరాజు, హేమలత, ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం తర్తూరు, మండ్లెం, తంగడంచ గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వారు వ్యవసాయంలో తీసుకోవాల్సిన పలు అంశాలను రైతులకు వివరించారు. పంటలు సాగుచేసిన తర్వాత పురుగు, తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉన్నట్లయితే వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనల మేరకు పంటలు కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారిణి తేజస్విని పాల్గొన్నారు.

రైతుల కోసమే వికసిత కృషి సంకల్ప అభియాన్


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమణయ్య

వెలుగోడు: రైతుల అభివృద్ధి కోసమే భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని బోయరేవుల, మోతుకూరు, మాధవరం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రమణయ్య ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏ పంటకు ఎంత ఎరువులు ఏ సమయంలో వేయాలనే విషయాలు తెలియజేశారు. భాస్వరం భూసార పరీక్షలు చేసుకున్న తరువాత అందుకు అనుగుణంగా చివరి దుక్కిలో మాత్రమే బాస్వరాన్ని వేసుకోవాలని, సూచించారు. విత్తనం ఎంపిక, కొత్త వంగడాలు, కలుపు నివారణ చర్యలను వివరించారు. ఎరువులు, పురుగు మందులు తగ్గించి పంటలు పండించాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, సుగన్న, డీఆర్‌సీ నుంచి సరళమ్మ, ఏడీఏ ఉమాపతి, పశువైద్యాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి సహకరించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ఆత్మకూరు అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సభ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలో వివిధ పనులకు సంబంధించిన తీర్మానాలను సభ్యులు నిరాకరించడంతో అభివృద్ధికి సంబంధించి పనుల టెండర్లను రద్దు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో–ఆప్షన్ సభ్యులు రషీద్, వార్డు కౌన్సిలర్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి


నర్ర శాంతకుమారి

నందికొట్కూరు: తన తండ్రి మరణించగా ఆయన ఉద్యోగాన్ని తన సోదరి తీసుకుని తనకు ఏ మాత్రం వాటా ఇవ్వకుండా మోసం చేసిందని, తనకు న్యాయం చేయాలని మండల పరిధిలోని దామగట్ల గ్రామానికి చెందిన నర్ర శాంత కుమారి కోరారు. సోదరి మోసం చేసిందంటూ శుక్రవారం గ్రామంలో ఆమె ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు నర్ర దేవదానం, ఆరోగ్యమ్మలకు తన సోదరి కృపవర కుమారి, తాను కూతుళ్లమన్నారు. తన తండ్రి అవుకు మండలం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో గతంలోనే మృతి చెందాడన్నారు. తల్లి సంరక్షణలో తోపాటు కుటుంబ బాధ్యతలు తీసుకుంటానని తన సోదరి 1987లో ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరిందన్నారు. 1989లో తన సోదరి వివాహం చేసుకోగా, తల్లి అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. అప్పటి నుంచి తన బాగోలు తన సోదరి పట్టించుకోలేదన్నారు. తన భర్త కూడా అనారోగ్యంతో మృతి చెందాడని, తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఇద్దరు పిల్లల పోషణ భారంగా ఉందని తన సోదరి నుంచి న్యాయం జరిగేలా చూడాలని శాంతకుమారి వేడుకున్నారు.

సంక్షిప్తం

హక్కుల పరిరక్షణే సీఐటీయూ ధ్యేయం

ఆత్మకూరు: కార్మిక హక్కుల పరిరక్షణ కోసమే సీఐటీయూ ధ్యేయమని యూనియన్ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు ఆనంద్‌బాబు, వీరన్న, రాజేష్, శ్రీను, బాషా, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం ఎన్నిక అక్రమం

ఆత్మకూరు: ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం పట్టణ కమిటీ ఎన్నిక అక్రమంగా జరిగిందని సంఘం పట్టణ సెక్రటరీ జక్కు గురుప్రసాద్ ఆరోపించారు. సంఘానికి చెందిన కొందరు పెద్ద మనుషులుగా చలామణి అవుతూ శుక్రవారం నాటి ఆర్యవైశ్య మహిళా మండలి ఎన్నికల్లో పోలింగ్ జరగనీయకుండా అనుకూలమైన మహిళను ఏకగ్రీవంగా అధ్యక్షురాలిగా ప్రకటించి, నిరంకుశధోరణి అవలంబించారన్నారు.

సర్వేను నిలిపివేయాలి

ఆత్మకూరు: ఇంటి పన్నుల పెంపు సర్వేను నిలిపేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిధిలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఆలయంలోని చిన్న కోనేరు ప్రాంగణాలతో పాటు మహా ద్వారం ముందు భాగంలో వర్షపు నీరు నిలవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా మహానందీశ్వరస్వామి వారి పల్లకీ సేవ రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు.